క్లుప్తంగా

ఊరూరా పోలీసుల ప్రచారం

దండేపల్లి: మండల పోలీస్‌శాఖ దండేపల్లి ఎస్సై సాంబమూర్తి ఆధ్వర్యంలో తమ సిబ్బందితో దొంగలు తిరుగుతున్నారని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఊరూరా తిరిగి పోలీసులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రజలు ఇల్లు విడిచి ఊర్లకు వెళ్లినప్పుడు నగదు, బంగారం ఉంటే బ్యాంకుల్లో భద్రపరుచుకుని వెళ్లాలని, ఎక్కువ రోజులు వెళ్తే పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పిస్తున్నారు. అక్కడక్కడ జరుగుతున్న దొంగతనాలను దృష్టిలో పెట్టుకుని, ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేస్తున్నట్లు, ఈ విషయాల్లో ప్రజలు తగిన జాగ్రత్త వహించాలని సూచిస్తున్నారు.

వీడ్కోలు వేడుకలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

దండేపల్లి: మండలంలోని ద్వారక ఉన్నత పాఠశాలలో సోమవారం పదో తరగతి విద్యార్థులకు, తొమ్మిదో తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జయప్రద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ మిషన్‌పై శిక్షణ ప్రారంభం



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ రాజేందర్

భీమారం: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో స్వచ్ఛభారత్ మిషన్ అమలు గురించి ప్రజాప్రతినిధులకు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమం సోమవారం ప్రారంభమైంది. స్వచ్ఛ భారత్ మిషన్ టీం మేనేజర్ రాజేందర్ అవగాహన కల్పించారు. గ్రామాల్లో మరుగుదొడ్ల వినియోగంపై, డంపింగ్‌యార్డుల్లో తడి–పొడి చెత్తను ఎలా వేరు చేస్తున్నారనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. కార్యక్రమంలో జిల్లా శిశుసంక్షేమ అధికారి చిన్నయ్య, ఎంపీవో సతీష్‌రెడ్డి, సర్పంచులు, ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


రక్షణతో పని చేయాలి

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి తన విధి నిర్వాహణలో రక్షణతో పనిచేయాలని జీఎం(సేఫ్టీ) కే గురువయ్య తెలిపారు. శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో సోమవారం రక్షణ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ విభాగంలో వారోత్సవాలు నిర్వహించడం ఇదే ప్రథమం అన్నారు. సేఫ్టీ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ ప్రకారం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌పీ డీజీఎం డీవీ రావు, డీజీఎంలు చిరంజీవి, శివరావు, రక్షణ కమిటీ కన్వీనర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

'వర్షాకాలంలోగా వంతెన పూర్తి చేయాలి'

చెన్నూర్: మండలంలోని సుద్దాల వాగుపై నిర్మిస్తున్న వంతెనను వర్షకాలంలోగా పూర్తి చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపినాథ్ అన్నారు. వంతెన పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం చెన్నూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వంతెన పనులు ప్రారంభించి మూడు నెలలు కావస్తున్నా 10శాతం పనులు పూర్తి కాలేదన్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ డివిజన్ అధ్యక్షులు మాసాని రమేశ్, నాయకులు నరేశ్, రమేశ్‌లు పాల్గొన్నారు.

విశ్రాంత మహిళా ఉద్యోగులకు సన్మానం



ఆర్డీవోకు సన్మానం చేస్తున్న రిటైర్డు ఉద్యోగులు

బెల్లంపల్లి: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బెల్లంపల్లిలో ప్రభుత్వ విశ్రాంత మహిళా ఉద్యోగులకు ఆత్మీయ సన్మానం చేశారు. మున్సిపాలిటీ పరిధి బజారు ఏరియాలో ఉన్న తెలంగాణ రిటైర్డు ఎంప్లాయీస్ సంఘ భవనంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ విరమణ చేసిన 25మంది మహిళలకు ఆర్డీవో కె.శ్యామలా దేవి పూలమాల వేసి ఘనంగా సన్మానం చేశారు. అనంతరం సన్మాన గ్రహీతలైన మహిళలు ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో శ్యామల దేవిని శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి.ఆనందచారి, ప్రధాన కార్యదర్శి ఇ.చంద్రశేఖర్, రిటైర్డు ఉద్యోగులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీ టీమ్

- నిర్భయంగా ఫిర్యాదు చేయండి రక్షణ కల్పిస్తాం
- విద్యార్థులకు పోలీసుల భరోసా



మంచిర్యాలక్రైం: మాట్లాడుతున్న ఎస్సై రాజేంద్రప్రసాద్



నెన్నెల: అవగాహన కల్పిస్తున్న సీఐ రాజ్‌కుమార్‌గౌడ్

మంచిర్యాలక్రైం: మహిళల భద్రత కోసం షీ టీమ్ పోలీసులు(షాడో) నీడలా ఉంటు రక్షణ కల్పిస్తారని స్థానిక షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై రాజేంద్రప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థిని, విద్యార్థులకు షీ టీమ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల భద్రత కోసం పోలీస్‌శాఖలో షీ టీమ్ పేరుతో ప్రత్యేక పోలీస్ వింగ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. షీ టీమ్ పోలీసులు మఫ్టీలో ఉంటూ పోకిరీలు చేస్తున్న అల్లరి వేశాలను, రహస్యంగా చిత్రీకరించి వారి భరతం పడుతారని తెలిపారు. మహిళలను వేధించడం, ప్రేమ పేరుతో మోసం చేయడం, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్ పాల్పడిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేసినా, అసభ్యకరంగా మాట్లాడినా, సెల్‌ఫోన్ ద్వారా మెస్సెజ్‌లు చేసినా షీ టీమ్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతూ, పోకిరీలను పట్టుకొని పోలీస్ పద్ధతిలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒకటి లేదా రెండుసార్లు పట్టుబడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మహిళలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. 100కు గాని షీ టీమ్ వాట్సాప్ నంబర్6303923700కు సమాచారం ఇవ్వాలన్నారు. ఇటీవల ఎక్కువగా సైబర్ నేరాలు జరుగుతున్నాయని, వాటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు. షీ టీమ్ మహిళలకు రక్షణ కల్పిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పర్వర్దన్, లెక్చరర్స్ ప్రేమలత, కనకమహాలక్ష్మి, షీ టీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

నెన్నెల: మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాల, కాలేజీ విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ నేరాలపై సోమవారం బెల్లంపల్లిరూరల్ సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, నెన్నెల ఎస్సై రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. లాటరీ వచ్చిందని, కూపన్స్ వచ్చాయని సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్‌లో మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి వారిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచితుల నంబర్లతో స్మార్ట్ ఫోన్‌లలో వచ్చే వెబ్ లింక్‌లను క్లిక్ చేయొద్దని సూచించారు. ప్రస్తుతం విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు, షీ టీమ్స్ పనితీరు, ట్రాఫిక్ రూల్స్‌పై విద్యార్థినులకు వివరించారు. విద్యార్థులు లక్ష్యం పెట్టుకొని కష్టపడి చదివి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని కోరారు. కార్యక్రమంలో కేజీబీవీ ఎస్‌ఓ కల్యాణి, టీచర్ పద్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.



కాసిపేట: అవగాహన కల్పిస్తున్న ఎస్సై గంగారాం

మహిళల భద్రతపై అవగాహన

కాసిపేట: స్థానిక ముత్యంపల్లి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ క్రైమ్, మహిళల భద్రతపై ఎస్సై గంగారాం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల ప్రత్యేక అధికారి సరిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు, పోలీసులు పాల్గొన్నారు.

'గ్రీవెన్స్'కు స్పందన అంతంతే..!

- అధికారులు వచ్చినా.. రాని జనం
- ప్రజావాణిపై అవగాహన కరువు

బెల్లంపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సంబంధమైన సమస్యల పరిష్కారం కోసం 4, పంచాయతీ రాజ్ శాఖకు చెందిన సమస్య పరిష్కారం కోసం 1 చొప్పున మొత్తం 5అర్జీలు వచ్చాయి. వీటిని తహసీల్దార్ కుమారస్వామి, మండల ప్రత్యేక అధికారి దుర్గాప్రసాద్ స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, కేపీ ఏపీఎం శ్యామల, వైద్య ఆరోగ్య శాఖ, పశు, వ్యవసాయశాఖల అధికారులు పాల్గొన్నారు.

కాసిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎంపీడీఓ ఎం.ఏ.ఆలీంకు ముత్యంపల్లి, చిన్నధర్మారం గ్రామపంచాయతీల కార్మికులు వేతనాలు చెల్లించాలని వినతిపత్రం సమర్పించారు. ఐదు నెలలుగా మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని, జీతాలు లేక ఇబ్బందులు పడుతూ జీవితాలు సాగిస్తున్నట్లు వాపోయారు.



బెల్లంపల్లి: మాట్లాడుతున్న తహసీల్దార్

కోటపల్లి/చెన్నూర్‌రూరల్/భీమారం: చెన్నూర్, భీమారం, కోటపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరువైంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అధికారులు ఉన్నప్పటికీ, ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు, సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారమయ్యేలా చూస్తామని అధికారులు తెలిపారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

- ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

బెల్లంపల్లి: నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని పురస్కరించుకుని భారత జాగృతి ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన క్రికెట్ పోటీలు ముగిశాయి. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు సోమవారం ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సహజమని సూచించారు. కార్యక్రమంలో భారత జాగృతి రాష్ట్ర నాయకుడు ఎస్.సాజన్, ఏఎంసీ చైర్మన్ నిరంజన్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దనపల్లి బస్తీలో కొత్తగా పోచమ్మ, పోతురాజు, భూ లక్ష్మి, మహాలక్ష్మీ, సహిత గ్రామ శిల బొడ్రాయి ప్రతిష్ఠాపన నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వైస్ చైర్మన్ సుదర్శన్, కౌన్సిలర్ చంద్రశేఖర్, రాజలింగు గెల్లి, బస్తీవాసులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో 31మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు.



విజేతలకు బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే

పేదలకు చదువుతోనే భవిష్యత్

బెల్లంపల్లి: పేద, అట్టడుగు వర్గాలకు చదువు అత్యంత ముఖ్యమైందని, చదువుతోనే భవిష్యత్ ముడిపడి ఉందని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. తెలంగాణ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కాసిపేట బాలుర గురుకుల కళాశాల ఫేర్‌వెల్ డేను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముందస్తుగా బాబాసాహెబ్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఊటూరి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. చదువును మించిన ఆస్తి లేదన్నారు. విద్యార్థులపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుంటారని మంచిగా చదివి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. వివిధ అంశాల్లో రాణిస్తున్న విద్యార్థులను గుర్తించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నిరంజన్, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థులు

ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

మందమర్రిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదివే విద్యార్థులకు నాలుగు సంవత్సరాల పాటు అందించే ఉపకార (ఎన్‌ఎంఎంఎస్) వేతనాలు పొందడానికి మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు 11మంది ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిలో సహస్ర, అక్షరదీపిక, సాయి హర్షిత, విశ్వరూప్, రణధీర్, సిరి, అఫ్రీన్, సఫ్రీన్, అక్షర, ఆనంద్‌స్వరూప్, అశ్విత్‌తేజ ఉన్నారు.

కోటపల్లి: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష ఫలితాల్లో కోటపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. జాతీయ ఉపకార వేతనాలకు మోడల్ స్కూల్‌కు చెందిన ఎనిమిదో తరగతికి చెందిన పుర్రేళ్ల అంజలి, దబ్బేట హారిక, ఆలం సాయి విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తెలిపారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



బెల్లంపల్లి: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య



మంచిర్యాలటౌన్: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి/శ్రీరాంపూర్/మంచిర్యాలటౌన్/రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్/తాండూర్/జైపూర్/కాసిపేట/భీమారం: గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ గౌరవ అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినాన్ని ఆ యూనియన్ నేతలు, బీఆర్ఎస్, జాగృతి నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. పలుచోట్ల సేవా కార్యక్రమాలు, ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయంలో బెలంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య వేడుకలు నిర్వహించారు. స్వరాష్ట్ర సాధనలో కవిత మహిళలను జాగృతం చేయడంలో కీలకపాత్ర పోషించారని, ఆమెను సాటి మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.

మంచిర్యాలలో లెల్లె సినిమా చిత్రీకరణ



మంచిర్యాలఅర్బన్: పాత మంచిర్యాల శాలివాహన పవర్‌ప్లాంట్‌లో సోమవారం లెల్లె సినిమా చిత్రీకరించారు. సస్పెన్స్ థ్రిల్లర్‌తో చిత్రీకరిస్తున్న సినిమాకు మంచిర్యాలకు చెందిన తిరుపతివర్మ దర్శకత్వం వహిస్తున్నారు. జిల్లా కళాకారులకే ప్రాధాన్యత ఇస్తూ, జిల్లాలోనే ఎక్కువ భాగం షూటింగ్ జరుగుతుందని డైరెక్టర్ తెలిపారు.

మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు

బెల్లంపల్లి: అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం బెల్లంపల్లి మున్సిపాలిటీలోని రడగంబాలబస్తీలో మహిళలకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించారు. బస్తీ మహిళలు, మున్సిపల్ పారిశుధ్య కార్మికులు, మెప్మా ఆర్పీలకు వైద్య పరీక్షలు చేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మున్సిపల్ కౌన్సిలర్లు తుంగపల్లి సుజాత, పోతరాజుల లీల, వైద్యసిబ్బంది, సమాఖ్య అధ్యక్షురాలు, ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

'లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు'

మందమర్రిరూరల్: ప్రభుత్వం పేదలకు అందించే డబుల్ బెడ్‌రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగాయని జిల్లా స్థాయి అధికారితో మళ్లీ సర్వే చేయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. కలెక్టర్ బదావత్ సంతోష్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందించారు. పారదర్శకంగా సర్వే చేసి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మందమర్రి పట్టణ కార్యదర్శి దుర్గరాజ్, రామకృష్ణాపూర్ కార్యదర్శి మిట్టపల్లి శ్రీనివాస్, దేవి పోచన్న, మారపెల్లి రవి, వెంకటేశం, బాలకృష్ణ, కుర్ర అంజి ఉన్నారు.

సమాచారం

మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా ప్రవీణ్‌కుమార్



సీఐకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్సైలు

మంచిర్యాలక్రైం: మహిళా పోలీస్‌స్టేషన్ సీఐగా టి.ప్రవీణ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన సీఐని మహిళా ఎస్సైలు, పోలీస్‌స్టేషన్ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారుల సమస్యలు చట్టపరిధిలో పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

చెన్నూర్: పట్టణంలోని మదునంపోచమ్మ ఆలయ ఆవరణలో అమ్మవారికి హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం ఉదయం 11:30గంటలకు లెక్కించనున్నట్లు దేవాదాయ ధర్మదాయ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. లెక్కింపు కార్యక్రమానికి భక్తులు హాజరుకావాలని కోరారు.

పొనకల్ ఈవోగా రాహుల్

జన్నారం: మండలంలోని పొనకల్ మేజర్ గ్రామ పంచాయతీ ఈవోగా రేగొండ రాహుల్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇన్‌చార్జి ఈవోగా పని చేసిన విజయ్ సెలవుపై వెళ్లగా, గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయనను రెగ్యూలర్ చేస్తూ ఉత్తర్వులు రావడంతో సర్పంచ్ జక్కు భూమేశ్ సమక్షంలో పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాహుల్‌ను సర్పంచ్ శాలువా కప్పి సన్మానించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ బాలుర గురుకుల విద్యాలయంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందడానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. టీఎస్‌ఆర్‌జేసీ–2023సెట్ ఆధ్వర్యంలో ఈ నెల 31లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 6న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బెల్లంపల్లిలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో 40సీట్లు, బైపీసీ విభాగంలో 40సీట్లు ఉన్నాయన్నారు. ఆసక్తి గల విద్యార్థులు సంబంధిత సైట్‌లో దరఖాస్తు చేసుకుని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అధ్యాపకుల కోసం...

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంగ్లిష్ బోధించుటకు అతిథి అధ్యాపక పోస్టు ఖాళీగా ఉందని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, పీజీ కళాశాలలో ఇంగ్లిష్ బోధించుటకు సంబంధిత అర్హత కలిగి ఉండాలని ఈ నెల 17వ తేదీ లోపు దరఖాస్తు చేసుకుని డెమోకు హాజరుకావాలని కోరారు.

తైబజార్ వేలం

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని తైబజార్ వేలంను మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. దినసరి సంతను పట్టణానికి చెందిన సత్యనారాయణ గౌడ్ 3లక్షల14వేలకు, పట్టణ వారసంతను లియాఖత్ అలీ 2లక్షల85వేలు, పట్టణానికి చెందిన ఊత్కూరు వారసంతను కాసు ప్రవీణ్ లక్ష అరవై వేలకు వేలం ద్వారా దక్కించుకున్నారు. కార్యక్రమంలో మేనేజర్ శ్రీహరి, బిల్ కలెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు

కాసిపేట: మండలంలో మైనార్టీ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 15వ తేదీన మధ్యాహ్నం 12గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎం.ఏ.ఆలీం తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే వారు దరఖాస్తు ధృవీకరణ పత్రాలు తీసుకొని సకాలంలో హాజరుకావాలని సూచించారు.

భీమిని బీజేపీ అధ్యక్షుడిగా సత్యనారాయణ

భీమిని: మండల బీజేపీ అధ్యక్షుడిగా కొంక సత్యనారాయణను నియమించి సోమవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెర్రబెల్లి రఘునాథ్ సోమవారం నియామకపుపత్రం అందించారు.

చెన్నూర్ సీఐగా వాసుదేవారావు



చెన్నూర్: చెన్నూర్ సీఐగా ఎస్.వాసుదేవారావు సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ విధులు నిర్వర్తించిన టి.ప్రవీణ్‌కుమార్ శ్రీరాంపూర్ మహిళా పోలీసుస్టేషన్‌కు బదిలీ కాగా, భూపాల్‌పల్లి సీఐగా విధులు నిర్వర్తించిన వాసుదేవారావు చెన్నూర్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల సహకారంతో పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

సంక్షిప్త వార్తలు

ఆత్మరక్షణకు కరాటే అవసరం

జన్నారం: బాలికలకు ముఖ్యంగా ఆత్మరక్షణ కోసం కరాటే అవసరమని ప్రభుత్వ బాలికల పాఠశాల హెచ్‌ఎం పద్మజ పేర్కొన్నారు. నాలుగు నెలలుగా కరాటే మాస్టర్ సంజీవ్ ఆధ్వర్యంలో కరాటే శిక్షణ పొందిన విద్యార్థినులు సోమవారం కరాటే ప్రదర్శన చేశారు. కరాటే ప్రదర్శన చేసిన విద్యార్థినులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు.

చెత్త బండిని పంపించాలని వినతి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని 17వ వార్డుకు సంబంధించిన చెత్త తీసుకెళ్లే బండి 40రోజుల కింద పాడైందని, మరో చెత్త బండిని పంపించాలని ఆ వార్డు కౌన్సిలర్ పూదరి సునిత సోమవారం మున్సిపల్ కమిషనర్ గద్దె రాజుకు వినతిపత్రం అందించారు.

డాక్టర్ రజిత సేవలు చిరస్మరణీయం

తాండూర్: అనాథ విద్యార్థులకు, ప్రజలకు వైద్య సేవలు అందించి అకాల మృతిచెందిన డాక్టర్ లావుడియా రజిత జయంతిని సోమవారం తాండూర్‌లో నిర్వహించారు. సేవా జ్యోతి శరణాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్వాహకురాలు శ్రీదేవి, అనాథలు రజిత చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

నాటిన మొక్కలు సంరక్షించాలి

వేమనపల్లి: హరితహారంలో నాటిన మొక్కలకు సంరక్షణ చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి ఉదయ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సోమవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఉపాధి కూలీల ఆధార్ అనుసందానం పూర్తి చేయాలని, ప్రతి గ్రామ పంచాయతీలో కూలీల సంఖ్య పెరిగేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. నర్సరీల్లో మొక్కల పెంపకం కోసం తీసుకోవాల్సిన చర్యలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మయ్య, తహసీల్దార్ రాజ్‌కుమార్, ఏపీఓ సత్యప్రసాద్, ఈసీ మధుకర్, టీఏలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

బెల్లంపల్లిరూరల్: గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న కంటి వెలుగు శిబిరాల్లో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని మండల ప్రత్యేకాధికారి దుర్గప్రసాద్ అన్నారు. బెల్లంపల్లి మండలం కన్నాలలో నిర్వహిస్తున్న కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఎంపీడీవో రాజేందర్, పీహెచ్‌సీ వైద్యుడు అనీష్, సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని మాకులపేటలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ శ్రీనివాస్ సోమవారం ప్రారంభించారు.

వేమనపల్లి: మండలంలోని నీల్వాయి గ్రామ పంచాయతీ కేంద్రంలో కొనసాగుతున్న కంటి వెలుగు శిబిరాన్ని మండల ప్రత్యేక అధికారి ఉదయ్‌కుమార్ తనిఖీ చేశారు.

మొల్లమాంబ జయంతి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని బైపాస్ రోడ్డులో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద జిల్లా కుమ్మర సంఘం నాయకులు కవయిత్రి మొల్లమాంబ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కుమ్మర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షులు గంగాధరి తిరుపతి, నాయకులు ప్రసాద్, రామస్వామి, తిరుపతి, వెంకటేష్, కుమ్మర కుల బాంధవులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ పోస్టర్ ఆవిష్కరణ

శ్రీరాంపూర్: ఈ నెల 25 నుంచి 27వరకు మంచిర్యాల ఎఫ్‌సీఐ ఫంక్షన్‌హాల్లో జరిగే ఐఎఫ్‌టీయూ 9వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆ సంఘం నాయకులు సోమవారం ఆవిష్కరించారు. శ్రీరాంపూర్‌లోని సివిల్ కార్యాలయం వద్ద సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ బ్రహ్మానందం విడుదల చేశారు. మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలోని సింగరేణి, బీడీ, హమాలీ, మోటార్, మున్సిపల్, కేజీబీవీ తదితర రంగాల్లో పనిచేసే కార్మికుల సమస్యలపై ఈ మహసభల్లో చర్చించి వాటి సాధన కోసం భవిష్యత్‌లో చేపట్టే పోరాట కార్యక్రమాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

బ్యాంకుల ద్వారా ఆసరా పెన్షన్లు ఇవ్వాలి

రామకృష్ణాపూర్: ఆసరా పెన్షన్లు పోస్టాఫీస్ ద్వారా కాకుండా బ్యాంకుల ద్వారా ఇవ్వాలని పట్టణానికి చెందిన దివ్యాంగులు సోమవారం క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణకు వినతిపత్రం అందించారు. పోస్టాఫీసులో కనీస సౌకర్యాలు లేవని ర్యాంప్ లేకపోవటం, కనీసం తాగునీటి వసతి కూడా లేకపోవటంతో దివ్యాంగులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు.